క్లుప్తంగా

మద్యం సీసాలు స్వాధీనం

ముదినేపల్లిరూరల్: మండలంలోని వడాలిలో మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎం.మంగయ్య కొంతకాలంగా మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ వెంకట్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మండవల్లి: మండవల్లి ఎస్సీ కాలనీలో సర్పంచ్ మెండా ఝాన్సీ శుక్రవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శానిటేషన్ సక్రమంగా ఉంటే ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. లేకుంటే ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కారణంగా పనులు సక్రమంగా నిర్వహించి, బ్లీచింగ్, సున్నం కొడుతున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్ పాల్గొన్నారు.

అన్నసమారాధన



గుడివాడరూరల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా స్థానిక తటివర్రురోడ్‌లో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆదర్శనగర్‌యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. 9రోజుల పాటు వైభవంగా జరిగిన అమ్మవారి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ అన్న సమారాధన నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు బేతంశెట్టి వెంకటరవి కుమార్, ఈశ్వర్, మసిముక్కు నాగరాజు, నాగేశ్వరరావులు తెలిపారు. ఈ అన్నసమారాధనలో 1700 మంది భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన

తోట్లవల్లూరు: మానవ అక్రమరవాణాను నిరోధానికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రంగారావు అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ (హైదరాబాద్), మండల మహిళా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యాన స్థానిక వెలుగు కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిరోధంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఉద్యోగాలు, సినిమా అవకాశాల పేరుతో అక్రమార్కులు మహిళలను మోసం చేస్తూ విదేశాలకు అమ్ముతున్నారని, ఈ మోసాలపై మహిళల్లో చైతన్యం పెంచాల్సిన అవసరం ఉందని రంగారావు తెలిపారు. సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ, వెలుగు ఏపీఎంలు కృష్ణంరాజు, భూషణం, ప్రజ్వల కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హిమకుమారి, వీఓఏలు పాల్గొన్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం



గుడివాడరూరల్: మండలంలోని చిన ఎరుకపాడు గ్రామంలో శ్రీఅష్ట లక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో శ్రీ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిసిన సందర్భంగా శుక్రవారం అమ్మవారికి పంచామృతాభిషేకం సహస్రనామార్చన నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



తోట్లవల్లూరు: పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్‌బాబు పేర్కొన్నారు. పెనమకూరు జెడ్పీ పాఠశాలలో పోలీసు అమరవీరుల వారోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవటంతోపాటు వైర్‌లెస్ సెట్ ఉపయోగం, డయల్ 112, 1930, దిశ యాప్ ఉపయోగాలు, పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాటి పనితీరుపై ఓపెన్‌హౌస్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు సీఐ కిషోర్ బాబు బహుమతులను అందజేశారు. ఎస్ఐ పి.విశ్వనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పీడీ బాలస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ పద్మావతి, కమిషనర్

కైకలూరు: ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కై కలూరు-5 జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డీఎన్నార్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం 108, 104, ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేశారన్నారు. అదే బాటలో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ అనేక పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి శివన్నారాయణ, వైద్యులు అన్నపూర్ణ, బి.శేఖర్, రాజశేఖర్, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

గుడివాడ టౌన్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం అని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక టౌన్ హైస్కూల్‌లో 3వ వార్డు గౌరీశంకరపురం-1 సచివాలయ పరిధి వారికి, స్థానిక పార్క్ స్కూల్‌లో 4వ వార్డు గౌరీశంకరపురం-2 పరిధిలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పద్మావతి మాట్లాడుతూ ఇక్కడ వైద్య పరీక్షల ద్వారా రుగ్మతలను గుర్తించి, ఆరోగ్యం మెరుగుపర్చేందుకు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. అవసరమైన వారిని పెద్ద ఆసుపత్రులకు తరలించి ఉచిత సేవలు అందజేస్తామన్నారు. స్థానిక టౌన్ హైస్కూల్‌లో పురుషులు 351, మహిళలు 315, మొత్తం 666 మందికి, స్థానిక పార్క్ స్కూల్‌లో పురుషులు 529, మహిళలు 303 మొత్తం 842 మంది వైద్య సేవలు పొందినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి, డాక్టర్ జయప్రద, డాక్టర్ సురేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు దుడ్డు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

కై కలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఎం.నాగ్యేశ్వరరావు అన్నారు. శుక్రవారం కై కలూరు-5 సచివాలయంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరంలో అందుతున్న సేవలపై రోగులను వివరాలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఎల్‌హెచ్, ఏఎన్ఎం, సీహెచ్‌ఓ, ఆశలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.శేఖర్, మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, వైద్య నిపుణులు, వైద్య ఆరోగ్య శఖాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, స్తంభాల ఏర్పాట్ల పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ టి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆర్టీసీ కాలనీ, బ్యాంక్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, చౌదరిపేట, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఉదయం 8.30 గంటల నుంచి..

పామర్రు: పామర్రు 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ 1,2 ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నిమిషాల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టుఉ పామర్రు విద్యుత్‌శాఖ ఏఈఈ మోహన కృష్ణారావు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ల వెంట చెట్లను నరికి వేసే పనులు చేయనున్నందున విద్యుత్‌ను నిలుపుదల చేయటం జరుగుతోందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండవల్లి: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పెరికెగూడెం సబ్‌స్టేషన్ ఎలక్ట్రికల్ పోల్స్ మార్పిడికి సంబంధించిన పనుల కారణంగా సబ్‌స్టేషన్ నుంచి వేళ్లే గ్రామాలకు శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రామకృష్ణ శుక్రవారం పేర్కొన్నారు. మండవల్లి, పెరికెగూడెం, కానుకొల్లు, లింగాల, గన్నవరం, మొకాసాకలవపూడి, సింగనపూడి, మూడుతాళ్లపాడు, కొర్లపాడు గ్రామాలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మహాభారతాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



ప్రసంగిస్తున్న శ్రీధర్

గుడివాడ టౌన్: ధర్మస్థాపనకు మహాభారతాన్ని ఆదర్శంగా తీసుకోవాలని హిందూధర్మ ప్రచార పరిషత్ గుడివాడ శాఖ కార్యదర్శి కావూరి శ్రీధర్ అన్నారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని శ్రీ రమా సహిత వీరవెంకట సత్యన్నారాయణ స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం మహాభారతంపై ప్రసంగించారు. దేవస్థానం ట్రస్ట్, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో 28వ తేదీ వరకు ఆశ్వయుజ మాసమును పురస్కరించుకుని మహాభారతం విశిష్టతను భక్తులకు వివరించారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ కృష్ణాజిల్లా కో ఆర్డినేటర్ సీవీకే ప్రసాద్, ఆలయ అధ్యక్షురాలు గుదే లక్ష్మీ రంగనాయకమ్మ, కోశాధికారి మాదాసు వెంకటలక్ష్మీకుమారి, అర్చకులు వి.రామకృష్ణమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: మండలంలోని కపిలేశ్వరపురం గ్రామంలో గురువారం రాత్రి అయ్యప్ప పడిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పడిపూజ సందర్భంగా ప్రత్యేక మందిరం నిర్మించి దేవతామూర్తులను కొలువుదీర్చి పూజలు జరిపించారు. స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ అయ్యప్ప నామ స్మరణతో కపిలేశ్వరపురం గ్రామం మార్మోగింది. పూజా కార్యక్రమాల అనంతరం భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప, భవానీ మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్పను పూజించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ముదినేపల్లిరూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య లబ్ధిదారులను కోరారు. మండలంలోని కొరగొంటపాలెం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలన్నారు. గ్రామంలో శనివారం నిర్వహించే జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటర్ల జాబితా సవరణలకు అవకాశం

పామర్రు: ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని పామర్రు నియోజకవర్గ ఈఆర్‌వో శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ డిశంబర్ 9వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందని అన్నారు. నవంబర్ 4,5 తేదీల్లో, డిశంబర్ 2,3 తేదీల్లో ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎన్నికల డీటీ జగన్‌మోహన్‌రావు, ఎన్నికల సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.

'ఉజ్వల'లబ్ధిదారులకు రూ.648కే సిలిండర్

మండవల్లి: ఉజ్వల గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులకు రూ.648 కు గ్యాస్ సిలిండర్ అందజేయనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం పేర్కొన్నారు. సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ పోను రూ.648 చెల్లించాలన్నారు. కొత్తవారికి గ్యాస్ కనెక్షన్ ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు స్థానిక శ్యామలాంబ గ్యాస్ ఏజెన్సీలో సంప్రదించాలని కోరారు.

బీమా పథకాలపై అవగాహన



కై కలూరు: పారిశుద్ధ్య కార్మికులు పోస్టాఫీస్ పథకాల్లో సొమ్ము పొదుపు చేసుకుంటే ఆర్థిక ఇబ్బందుల్లో ఆసరాగా ఉపయోగపడతాయని కై కలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి అన్నారు. స్థానిక సచివాలయంలో పోస్టల్ బీమా పథకాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. గుడివాడ పోస్టల్ సూపరింటెండెంట్ కత్తి ఆదినారాయణ పోస్టాఫీస్‌లో అందించే వివిధ బీమా, పొదుపు పథకాలను వివరించారు. సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి సహాయంతో పారిశుద్ధ్య కార్మికులకు, వాటర్ వర్క్స్ సిబ్బందికి, డ్రైనేజీ సిబ్బందికి ఏడాదికి రూ.399 చొప్పున 80 మందికి ఆరోగ్య బీమాను అందించారు. ఐపీపీబీ మేనేజర్ గణేష్, పోస్ట్‌మాస్టర్ దానం ఆనంద్ వినయ్‌కుమార్, పోస్టల్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు వివరాలు సరిచూసుకోవాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి రామకృష్ణ



కూచిపూడిలో జాబితా విడుదల చేస్తున్న ఏవో శివప్రసాద్

కలిదిండి: రైతుల ఈక్రాప్ ఈకేవైసీ వివరాలకు సంబంధించి రైతులు తమ వివరాలు సరి చూసుకొని ఏమైనా అభ్యంతరాలున్నవారు ఆర్బీకేలో తెలియజేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ అన్నారు. మండలంలోని కోరుకొల్లులోని రైతులతో గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ క్రాఫ్ జాబితాలోని వివరాలు సరిచుసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్‌లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ ఆర్.గంగాధరరావు, మండల వ్యవసాయాధికారి కె.విద్యాసాగర్, సహాయ వ్యవసాయ సంచాలకులు జి.ఆంజనేయులు, ఉలిసి అప్పారావు, వీఏఏ మధుబాబు, రైతులు పాల్గొన్నారు.

మండవల్లి: మండల పరిధిలో 2023 సంవత్సరంలో సాగు చేసిన పంటలను ఈ క్రాఫ్‌లో నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా పేర్కొన్నారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ ఈ కేవైసీ వివరాలకు సంబంధించిన తుది జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 26న ప్రదర్శించినట్లు తెలిపారు. రైతులు ఈ క్రాఫ్ వివరాలు సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే సవరించడానికి రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. 28న రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 28న అయ్యవారిరుద్రవరం, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, గన్నవరం, మండవల్లి, లోకుమూడి, పుట్లచెరువు ఆర్బీకే కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు.

జాబితాల ప్రదర్శన

ముదినేపల్లిరూరల్: మండలంలోని వణుదుర్రు, శ్రీహరిపురం, సింగరాయపాలెం, కొరగుంటపాలెం, అల్లూరు, బొమ్మినంపాడు, పెదగొన్నూరు, దేవపూడి, వాడవల్లి, ఊటుకూరు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి గ్రామసభలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుభరోసా కేంద్రాల వద్ద ఇప్పటివరకు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల జాబితాలను ప్రదర్శించారు. గ్రామ సభలను పరిశీలించిన ఏడీఏ జి.వెంకటమణి మాట్లాడుతూ ప్రదర్శించిన జాబితాల్లో ఏమైనా సవరణలు ఉంటే ఈ నెల 29 లోపు స్థానిక వ్యవసాయ సహాయకుల ద్వారా సరిచేసుకోవాలన్నారు. ఖరీఫ్ వరిసాగు ఈనిక దశలో ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కోరారు. మండల వ్యవసాయాధికారి బి.వేణు మాధవ్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కైకలూరు: ఈ క్రాప్ ముసాయిదా జాబితాలో రైతులు తమ వివరాలను సరి చూసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ అన్నారు. మండలంలో వేమవరప్పాడులో ఈ క్రాప్ ముసాయిదా జాబితా ప్రదర్శనపై గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ ఆర్.గంగాధరరావు, కైకలూరు వ్యవసాయ అధికారి ఆర్.దివ్య, వీఏఏ గోపీనాథ్, సర్పంచ్ నున్న రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ చేసిన రైతుల జాబితా ప్రదర్శన

కూచిపూడి(మొవ్వ): ఖరీఫ్ 2023 పంట కాలానికి సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ చేయబడిన రైతుల ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు ఎంఏవో కంచర్ల శివ ప్రసాద్ తెలిపారు. ఈ ముసాయిదా జాబితాలు ఈ నెల 29వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని, జాబితాలను పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే సవరణకు ఆర్బీకేలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు రాతపూర్వకంగా తెలియజేయాలని వివరించారు. వచ్చిన అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో సవరించి 29వ తేదీలోగా ఫైనల్ జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు.

జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక



అండర్-17 బాలికల జట్టు



అండర్-14 బాలికల జట్టు

గుడివాడ టౌన్: స్కూల్ గేమ్స్‌లో ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్పీఎస్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి బాలికల ఖోఖో జట్ల ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు సంబంధించి 16 నియోజక వర్గాలకు చెందిన అండర్-14, అండర్-17 క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొన్నారు. రెండు జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరి దాసరి శ్రీనివాసరావు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్లు నవంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్-17 జట్టు కాకినాడలో, అండర్-14 జట్టు చిత్తూరు జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఎంపిక కార్యక్రమంలో జిల్లా సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు మడకా ప్రసాద్, జె శ్రీనివాసరావు, ఎం.జ్యోతి, కె.శ్రీను, జి.రాంబాబు, బి.అనిత, పీఎస్ సోమేశ్వరరావు, కె.అనూరాధ, ఎన్.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వ్యాధుల నివారణ సాధ్యం



కురుమద్దాలి గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పామర్రు: సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వీ వంశీ కృష్ణ తెలిపారు. మండలంలోని కనుమూరు పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న 9వ ఫీవర్‌సర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను అవగాహన కల్పించడంతో పాటు రోగాల బారిన పడుతున్న వారి రక్త నమూనాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బందితో పాటుగా వలంటీర్లు, ఫీవర్ సర్వేను నిర్వహిస్తున్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

గుడివాడ టౌన్: గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు ఆర్డీఓ పి.పద్మావతి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆమె అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నియోజకవర్గంలోని 230 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా సిద్ధం చేశామన్నారు. డిసెంబర్ 9వ తేదీ వరకు ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే పోస్ట్ ద్వారా కానీ ఆన్‌లైన్ ద్వారా కానీ అధికారులకు తెలియ జేయాలని కోరారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఫారం-6 ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుత సమాచారం మేరకు మొత్తం నియోజకవర్గంలో 1 లక్ష 96 వేల 8 వందల 43 ఓటర్లు నమోదు కాగా వారిలో పురుషులు 94 వేల 664, మహిళలు 1 లక్ష 2 వేల 163 కాగా ఇతరులు 16 మంది ఉన్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి ఆంజనేయ ప్రసాద్, టీడీపీ ప్రతినిధి తులసి, జనసేన ప్రతినిధి మద్ది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

76 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

గుడివాడ టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు అందజేస్తామని తహసీల్దార్ కె.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక 5, 6 వార్డు సచివాలయాల పరిధిలోని పేదలకు జగనన్న కాలనీలో ఇళ్లపట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవానికి సొంత ఇంటికల నెరవేర్చాలనే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందులో భాగంగా పట్టణంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అంచలంచలుగా ఇళ్లపట్టాలు ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో ఇళ్లపట్టాల పంపిణీ నిమిత్తం 84 ఎకరాల భూమి సేకరించి పట్టాలు ఇచ్చామని ఆయన తెలిపారు. 5వ వార్డులో 33 మందికి, 6వ వార్డులో 43 మంది లబ్ధిదారులకు ప్రస్తుతం పట్టాలిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, 5వ వార్డు కన్వీనర్ వెంపల అప్పారావు, తోట శివాజి, దుడ్డు చిన్నా, శివప్రసాద్, మూడెడ్ల ఉమ, కె.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ లైన్‌మెన్‌ను ఆదుకోవాలి



ఎమ్మెల్యే అనిల్ కుమార్‌కు సమస్య వివరిస్తున్న వరప్రసాద్, గ్రామస్తులు

వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని సచివాలయంలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న షేక్ జిలానీకి ప్రభుత్వం నుంచి సాయం అందించాలని వెంట్రప్రగడ గ్రామస్తులు విజయవాడలో ఉన్న కై లే అనిల్‌కుమార్‌ను ఆయన నివాసంలో శుక్రవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్ మాట్లాడుతూ సచివాలయంలో అస్టిసెంట్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న జిలానీ విధుల్లో భాగంగా విద్యుత్ స్తంభం నుంచి కింద పడి తీవ్ర గాయాలతో విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, పేద కుటుంబం కావటంతో ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ జిలానీని అన్ని విధిలా ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిలానీకి ఆరు నెలల క్రితమే వివాహం కాగా భార్య గర్భవతి. గ్రామస్తులు షేక్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెడన: ఖాదీ మహోత్సవ్ సందర్భంగా శుక్రవారం మండల స్థాయిలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జరిగిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని ఎంఈఓ హరనాథ్ తెలిపారు. వక్తృత్వ పోటీల్లో జూనియర్స్ విభాగంలోఎం.హిమజ (కళాంజలి), కె.ఎస్.ఎల్. సుమ (విశ్వభారతి), పి. దిండుశిరివల్లి (బీజీకే జెడ్పీ) ఉన్నత పాఠశాలల నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ విభాగంలో ఎన్. అమృతరాణి, ఎల్. గౌరిశ్రీ, వి. పావనిలు బల్లిపర్రు గురుకుల పాఠశాల నుంచి ఎంపికయ్యారు. వ్యాసరచన పోటీల్లో జూనియర్స్‌లో బి. శరణ్య (బీజీకే జెడ్పీ), జె. శ్రుతి (గురుకులం), పి. హారిక (బీజీకే జెడ్పీ) ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. సీనియర్స్ విభాగంలో బల్లిపర్రు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు కె. శశి, జి. సరళ, సీహెచ్ శారద ఎంపికయ్యారు. 28న మచిలీపట్నంలో జిల్లా పోటీలకు హాజరవుతారు.

అయ్యప్ప స్వామిని దర్శించుకున్న కలెక్టర్



అయ్యప్ప స్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

కై కలూరు: ఏలూరు రోడ్డులోని అయ్యప్ప ఆలయాన్ని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శుక్రవారం సందర్శించారు. అయ్యప్ప స్వామివారిని దర్శించుకున్నారు. కలిదిండిలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన ఏలూరు వెళుతూ ఆలయం వద్ద ఆగి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆలయాన్ని పరిశీలించి, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఆలయ నిర్వాహకులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.